## హాకీ చైర్మన్ విజయకుమార్‌కు అభినందనలు



తెలంగాణ హాకీ చైర్మన్‌గా నియాకమైన కొండా విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ శనివారం తన నివాసంలో అభినందించారు. జాతీయ క్రీడైన హాకీ పట్ల మరింత ఆసక్తి క్రీడాకారులలో పెంపొందించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. గచ్చిబౌలి, పీజేఆర్ స్టేడియంలో మరిన్ని సౌకర్యాలను కల్పించాలని ఎమ్మెల్యేను విజయ్‌కుమార్ కోరారు. – మియాపూర్ , డిసెంబరు 23 :

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా శనివారం పలువురు కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో మృణాళిని శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, అసోం రాష్ట్రానికి చెందిన గౌతమ్ కుమార్ దాస్ శిష్య బృందం బిహు నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. –కొండాపూర్, డిసెంబర్ 23 :

## పేదలకు దుప్పట్లు పంపిణీ



ఎర్రగడ్డ డివిజన్ కల్యాణ్‌నగర్ వెంచర్–3 కాలనీకి చెందిన జమలాపూర్ సుధీర్‌కృష్ణ టీఎస్ ట్రాన్స్‌కోలో డీఈగా విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి రాంజీ 13వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్లు, పేదలకు సుధీర్‌కృష్ణ దుప్పట్లను పంపిణీ చేశారు. ట్రాన్స్‌కో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, రంగయ్య, యాదగిరి, హర్షవర్ధన్, సర్వేశ్వర్ పాల్గొన్నారు. –ఎర్రగడ్డ, డిసెంబర్ 23:

## పోలీస్ బెటాలియన్‌లో యోగా



బ్రహ్మకుమారీస్ శ్రీనగర్ కాలనీ శాఖ ఆధ్వర్యంలో శనివారం యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ పోలీస్ బెటాలియన్‌లో యోగా మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. లైఫ్ మేనేజింగ్ స్కిల్స్ అన్న అంశంపై బ్రదర్ బీకే త్రినాథ్ ఉపన్యాసం ఇచ్చారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు పాల్గొన్నారు. –జూబ్లీహిల్స్,డిసెంబర్23:

## క్రిస్మస్ వేడుకలు



కొండాపూర్, డిసెంబర్ 23 : క్రిస్మస్ డే వేడుకల్లో భాగంగా శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొని సందడి చేశారు.

# వైష్ణవారాధనతో ముక్తి మార్గం

- వేంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు



వేంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ , డిసెంబరు 23 : శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవ ఆలయాలు ప్రత్యేక అలంకరణలు ఉత్తర ద్వార దర్శనాలతో భక్తులకు ఆధ్యాత్మికతను అందించాయి. వివేకానందనగర్ డివిజన్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజాదికాలంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తం ఉపవాసంతో వైష్ణవారాధనతో ముక్తి మార్గం లభిస్తుందని పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం హిందువులకు ఎంతో పవిత్రమైనదని శ్రీ మహావిష్ణువును ఉత్తర ద్వార దర్శనం చేసుకోవటం అత్యంత విశిష్టమైనదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరిపైనా విష్ణువు అనుగ్రహం కలగాలని ఆయన ఆకాంక్షించారు.

**రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో...**

మాదాపూర్, డిసెంబర్ 23: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మాదాపూర్ డివిజన్ పరిధిలోని శిల్పా పార్క్‌లో శనివారం శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

**చందానగర్‌లో...**

కొండాపూర్, డిసెంబర్ 23 : వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగవంతుడి దీవెనలు ప్రజలందరిపై ఉంటాయన్నారు. నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలంటూ భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.



ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో కోలాటాలు ఆడుతున్న మహిళలు



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నాటక ప్రదర్శనతో క్రీస్తు జన్మదినాన్ని వివరిస్తున్న విద్యార్థులు

జూబ్లీహిల్స్,డిసెంబర్23: యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్‌పర్సన్ శిరీష భవానీ శంకర్, స్కూల్ మేనేజింగ్ కమిటీ డైరెక్టర్ జయంతి వెంకటరామన్ హాజరై క్రిస్మస్ విశిష్టతను వివరించారు. విద్యార్థులు క్రీస్తు జన్మదినాన్ని కళ్లకు కట్టేలా నాటిక, నాట్య, సంగీత ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వేడుకలలో క్రిస్మస్ తాత శాంతాక్లాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీనిధి కిడ్స్ క్యాస్టల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

**మోతీనగర్‌లో..**

వెంగళరావునగర్ డిసెంబర్ 23:సెమీ క్రిస్మస్ వేడుకలు ఉల్లాసంగా..ఉత్సాహంగా జరిగాయి. శనివారం మోతీనగర్ లోని కళ్యాణ్ నగర్ బ్రాంజ్ శ్రీనిధి కిడ్స్ క్యాస్టల్ లో విదార్థిని, విద్యార్థులు క్రిస్మస్ సంబురాలు నిర్వహించారు. క్రిస్మస్ వస్త్రధారణతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రేమ, కరుణ, వాత్సాల్యాన్ని పంచడమే క్రీస్తు సందేశమని పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్‌రావు అన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనగావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీత,వైస్ ప్రిన్సిపాల్ విమల,రాజశ్వరి,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటరు జాబితా అందరి బాధ్యత

జూబ్లీహిల్స్,డిసెంబర్23: పారదర్శకమైన ఓటరు జాబితా ప్రతి ఒక్కరి బాధ్యతని యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్ పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ కార్యాలయం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటరు జాబితాపై పూర్తి అవగాహన ఉండాలని.. ఎప్పటికప్పుడు ఓటరు నమోదు, సవరణలు, అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 2024 జనవరి 1 తో 18 ఏండ్లు నిండే యువతీ యువకులతో పాటు ఆయా ప్రాంతాలలో కొత్త వారిని ఓటరుగా నమోదు చేయించాలని.. చనిపోయిన వారి పేర్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌లు బాలరాజ్, కమల్, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్వో సేవా ఎస్లావత్